

TG/TEL/25/A3731

# నిజం

దృష్టి తెలుగు న్యూస్



WANTED

రిపోర్టర్లు కావలెను

నిజం దృష్టి తెలుగు న్యూస్

దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని అన్ని జిల్లా కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను

ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణలు రాయగల సామర్థ్యం ఉండాలి, అనుభవం గల వారికి ప్రాదాన్యత ఇవ్వబడును.

సెల్: 9247842354



హైదరాబాద్ | ఎడిటర్: వరుదు సుజాత | సంపుటి:-1 | సంచిక:-259 | పేజీలు:-4 | గురువారం 03- 09 - 2026

Hydrabab | Editer name : varudu sujatha | volume:01, | issue:259 | pages:04 | Thursday - 03-09-2026


## చిత్వాన్ జిల్లాలో అత్యధికంగా 348 మృతదేహాల వెలికితీత

- నేపాల్ జలప్రళయం.. 1,127కు పెరిగిన మృతుల సంఖ్య.. 4,858 మంది గల్లంతు!
- నేపాల్ ను అతలాకుతలం చేసిన ఫ్లాష్ ఫ్లడ్స్
- 6,541 మందిని సురక్షితంగా రక్షించిన రెస్క్యూ టీమ్స్



నేపాల్‌ను భయంకరమైన ఆకస్మిక వరదలు (ఫ్లాష్ ఫ్లడ్స్) అతలాకుతలం చేసిన సంగతి తెలిసిందే. ఈ జల ప్రళయం కారణంగా తీవ్ర ప్రాణనష్టం జరిగింది. నేపాల్ పోలీసు వర్గాలు వెల్లడించిన తాజా నివేదిక ప్రకారం... వరదల దాటికి బలైన వారి సంఖ్య 1,127కు పెరగ్గా, మరో 4,858 మంది - మిగతా 2 లో

## విమానయాన సంస్థలకు జెలెన్‌స్కీ హెచ్చరిక.. ఉగ్రవాదులతో చర్చలు ఉండవన్న పుతిన్

- రష్యాపై పెద్ద స్థాయిలో డ్రోన్ దాడులు చేయబోతున్నామన్న జెలెన్‌స్కీ
- రష్యా గగనతలం పౌర విమానయానానికి సురక్షితం కాదని హెచ్చరిక
- ఉక్రెయిన్ వైఖరి ఉగ్రవాదుల తీరును తలపిస్తోందన్న పుతిన్



రష్యా-ఉక్రెయిన్ యుద్ధం మరోసారి అత్యంత ఉద్రిక్త రూపం దాల్చింది. రష్యాపై మునుపెన్నడూ లేని రీతిలో అతిపెద్ద డ్రోన్ దాడులు - మిగతా 2 లో

## వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలన ప్రజా రంజకం



- ఆర్థిక లోటు ఉన్నా సంక్షేమం ఆపలేదు: పొంగులేటి
- వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- సామాన్యుల కష్టాలు తీర్చేందుకు నిరంతరం కృషి చేశామన్న పొంగులేటి
- రైతు సంక్షేమానికి రూ.1.76 లక్షల కోట్లు ఖర్చు చేశామని వెల్లడి

తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనను పూర్తి - మిగతా 2 లో

## "ఎటు చూసినా విధ్వంసం, వికృతమే"



- కాంగ్రెస్ 1000 రోజుల పాలనపై కేటీఆర్ ఫైర్
- కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై బీఆర్ఎస్ ఛార్జ్‌షీట్ విడుదల
- కాంగ్రెస్ అన్ని రంగాల్లో విఫలమైందని కేటీఆర్ విమర్శ
- రూ.4.50 లక్షల కోట్ల అప్పులు చేశారని ఆరోపణ
- రుణమాఫీ హామీని పూర్తిగా అమలు చేయలేదన్న కేటీఆర్
- కాళేశ్వరం విషయంలో రైతులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపణ

కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని బీఆర్ఎస్ - మిగతా 2 లో

# ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన

- రాజ్‌నాథ్‌సింగ్, రామ్మోహన్‌నాయుడితో భేటీ
- ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026 సమ్మిట్ కు రాజ్‌నాథ్ ను ఆహ్వానించిన రేవంత్
- డీఆర్‌డీఎల్ ప్రాజెక్టుకు ఉచితంగా భూమి కేటాయించాలని విన్నపం
- రాష్ట్రంలో విమానాశ్రయాల విస్తరణపై రామ్మోహన్ తో చర్చించిన సీఎం




ఢిల్లీ పర్యటనలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి... కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, పౌరవిమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడితో వరుసగా భేటీ అయ్యారు. రాష్ట్ర అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి

# నేపాల్ వరద బాధితులకు అండగా సోనూ సూద్

- చిన్నారులను చూసి హృదయం ద్రవించిందంటూ భావోద్వేగం
- నేపాల్ వరద బాధితులను ఆదుకునేందుకు ముందుకొచ్చిన నటుడు
- సహాయక శిబిరాల్లోని చిన్నారుల పరిస్థితి చూసి హృదయం ముక్కలైందని ఆవేదన
- ప్రతి ఒక్కరూ తమ వంతు సాయం చేయాలని ప్రజలకు విజ్ఞప్తి
- ఇది ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదన్న సోనూ సూద్
- మానవత్వంతో అందరూ స్పందించాలని పిలుపు




కరోనా సంక్షోభ సమయంలో వలస కార్మికులకు అండగా నిలిచి రియల్ హీరో అనిపించుకున్న నటుడు, సేవా తత్పరుడు సోనూ సూద్ మరోసారి తన విశాల హృదయాన్ని చాటుకున్నారు. పొరుగు దేశమైన నేపాల్‌ను అతలాకుతలం చేస్తున్న

## సావర్కర్‌కు ముస్లింలంటే ద్వేషం లేదు

కోర్టుకు తెలిపిన మనవడు



- సావర్కర్‌కు ముస్లింల పట్ల ద్వేషం లేదని కోర్టుకు చెప్పిన సాత్యకి
- రాహుల్ గాంధీ వ్యాఖ్యలతో సావర్కర్‌ను ముస్లింల ద్వేషిగా చిత్రీకరించారని ఆరోపణ
- లండన్‌లో రాహుల్ చేసిన వ్యాఖ్యలపై సాత్యకి పరువునష్టం దావా

హిందుత్వ భావజాలవేత్త వినాయక్ దామోదర్ సావర్కర్‌కు ముస్లింలపై ఎన్నడూ ద్వేషం లేదని, పైగా వారి - మిగతా 2 లో

## భారత్, చైనా, అమెరికా నుంచి నష్టపరిహారం కోరిన నేపాల్ మంత్రి



- నేపాల్ ఆకస్మిక వరదల వల్ల ఇప్పటి వరకు 11 వందల మందికి పైగా మృతి
- పారిశ్రామిక దేశాలు విడుదల చేసే ఉద్గారాల వల్ల తాము మూల్యం చెల్లించుకుంటున్నామన్న నేపాల్
- తమకు నష్టపరిహారం చెల్లించడం చట్టపరమైన బాధ్యత అని వ్యాఖ్య

నేపాల్‌ను ముంచెత్తిన ఘోర జలప్రళయం తీవ్ర నష్టాన్ని మిగిల్చిన వేళ, ఆ దేశ ప్రభుత్వం అంతర్జాతీయ వేదికలపై కీలక విజ్ఞప్తి చేసింది. - మిగతా 2 లో

## పల్నాడు జిల్లాలో పర్యటించిన మంత్రి నారా లోకేశ్



- నరసరావుపేట జేఎన్టీయూలో నూతన హాస్టళ్లను ప్రారంభించిన మంత్రి లోకేశ్
- నరసరావుపేట జేఎన్టీయూకేలో నూతన హాస్టల్ భవనాల ప్రారంభం
- రూ.70 కోట్ల వ్యయంతో 1,600 మంది విద్యార్థులకు వసతి సౌకర్యం
- గౌతమి, కృష్ణవేణి, నాగార్జున పేర్లతో వసతి గృహాల నిర్మాణం
- కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు

రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ నేడు పల్నాడు జిల్లాలో పర్యటించారు. - మిగతా 2 లో

## భర్తకు అన్నా కొణిదెల హృదయపూర్వక విషెస్



- పవన్ కల్యాణ్‌కు భార్య అన్నా కొణిదెల స్పెషల్ బర్త్‌డే విషెస్.. ఏమన్నారంటే?
- 55వ పుట్టినరోజు జరుపుకొంటున్న పవన్ కల్యాణ్
- పవన్ ఎంతోమంది హృదయాల్లో ఉన్నారని వ్యాఖ్య
- ఎంతో మంది జీవితాలను ప్రభావితం చేశావన్న అన్నా
- భర్తతో దిగిన ఫొటోను ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్న అన్నా

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, నటుడు పవన్ కల్యాణ్ 55వ పుట్టినరోజు సందర్భంగా - మిగతా 2 లో

# గోదారమ్మకు సాష్టాంగ ప్రణామం

- కాలువలో నిల్చొని చంద్రబాబు జలహారతి
- పాయకరావుపేట వద్ద ఉత్తరాంధ్రకు గోదావరి జలాలను విడుదల చేసిన సీఎం చంద్రబాబు
- కాలువలోకి దిగి గోదావరి జలాలకు ప్రత్యేక పూజలు, జలహారతి
- నాలుగు జిల్లాల్లో 2.87 లక్షల ఎకరాలకు సాగునీరు, 9 లక్షల మందికి తాగునీరు
- గోదావరి జలాలకు అడుగడుగునా నీరాజనాలు పలికిన ఉత్తరాంధ్ర ప్రజలు
- జలాలను ఉత్తరాంధ్రకు తెచ్చిన చంద్రబాబుకు రైతుల కృతజ్ఞతలు

ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల దాహార్తిని తీరుస్తూ, పోలవరం ఎడమ ప్రధాన కాలువ ద్వారా పయనించి వచ్చిన గోదావరి జలాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు అపూర్వ రీతిలో స్వాగతం పలికారు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట వద్ద క్రాస్ రెగ్యులేటర్ నుంచి వస్తున్న గోదావరి జలాలకు, స్వయంగా కాలువలోనే నిల్చుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అరుణ వర్ణంలో ప్రవహిస్తున్న గోదారమ్మకు పుష్పాలు సమర్పించి, జలహారతి ఇచ్చి తన కృతజ్ఞతను చాటుకున్నారు. పవిత్ర గోదావరి జలాలను శిరస్సుపై చల్లుకున్న అనంతరం, ఉద్విగ్నభరిత వాతావరణంలో గోదావరి ప్రవాహానికి సాష్టాంగ నమస్కారం చేసి అందరినీ ఆశ్చర్యపరిచారు. బుధవారం పాయకరావుపేటలో జరిగిన ఈ చారిత్రక కార్యక్రమంలో భాగంగా, ముఖ్యమంత్రి చంద్రబాబు తొలుత శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.



TG/TEL/25/A3731
నిజం
దృష్టి తెలుగు న్యూస్
గురువారం 03- 09 - 2026

## పల్నాడు జిల్లాలో పర్యటించిన మంత్రి నారా లోకేశ్

మొదటిపేజీ తరువాయి – ఈ పర్యటనలో భాగంగా నరసరావుపేట మండలం కాకాని గ్రామ సమీపంలోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలో (జేఎన్టీయూ కాకినాడ పరిధి) నూతనంగా నిర్మించిన హాస్టల్ భవనాలను ఆయన ప్రారంభించారు. రూ.70 కోట్ల వ్యయంతో 1,600 మంది విద్యార్థినీ విద్యార్థుల కోసం ఆధునిక సౌకర్యాలతో ఈ వసతి గృహాలను నిర్మించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని మంత్రి లోకేశ్ ఆవిష్కరించారు. అనంతరం గౌతమి, కృష్ణవేణి, నాగార్జున పేర్లతో నిర్మించిన మూడు హాస్టల్ భవనాలను రిబ్బన్ కట్ చేసి లాంఛనంగా ప్రారంభించారు. ప్రారంభోత్సవం తర్వాత హాస్టల్ ప్రాంగణాన్ని, గదులను కలియతిరిగి విద్యార్థులకు కల్పించిన వసతులను పరిశీలించారు. అంతకుముందు కళాశాల ప్రాంగణానికి విచ్చేసిన మంత్రి లోకేశ్ కు యూనివర్సిటీ యాజమాన్యం, విద్యార్థులు, సిబ్బంది ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నారా లోకేశ్, గొట్టిపాటి రవికుమార్‌తో పాటు రాజ్యసభ ఎంపీ భాష్యం రామకృష్ణ, నర్సరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యేలు చదలవాడ అరవిందబాబు, జీవీ ఆంజనేయులు, జూలకంటి బ్రహ్మారెడ్డి, భాష్యం ప్రవీణ్ పాల్గొన్నారు. అలాగే, జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, జాయింట్ కలెక్టర్ వి.సంజనా సిమ్హా, జేఎన్టీయూకే వైస్ ఛాన్సలర్ సీఎస్ఆర్కే ప్రసాద్, టీడీపీ జోనల్ కోఆర్డినేటర్ బీటీ నాయుడు, మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ తదితర ప్రముఖులు హాజరయ్యారు.

## భర్తకు అన్నా కొణిదెల హృదయపూర్వక విషెస్

మొదటిపేజీ తరువాయి – ఆయన భార్య అన్నా కొణిదెల ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. పవన్ ఎంతో మంది హృదయాల్లో, ఆలోచనల్లో, ప్రార్థనల్లో ఉన్నారని పేర్కొన్నారు. భర్తతో కలిసి దిగిన ఫొటోను ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్నారు. "ఈ రోజు నిన్ను సెలబ్రేట్ చేసుకుంటున్నాం. నువ్వు ఎంతోమంది హృదయాల్లో, ఆలోచనల్లో, ప్రార్థనల్లో ఉన్నావు. ఎంతోమంది జీవితాలను నువ్వు ప్రభావితం చేశావనడానికి ఇది నిదర్శనం. ఇతరులకు ఎంతో ఇచ్చావు. పుట్టినరోజు శుభాకాంక్షలు" అంటూ అన్నా పోస్టు చేశారు. అన్నా పంచుకున్న ఫొటోలో దంపతులిద్దరూ కిటికీ పక్కన కూర్చున్నారు. పవన్ పక్కనే అన్నా కూర్చొని ఆయన వైపు ఆప్యాయంగా చూస్తూ కనిపించారు. ఈ పోస్టు అభిమానుల దృష్టిని ఆకర్షిస్తోంది. పవన్ కల్యాణ్ 1996లో 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి' చిత్రంతో సినీరంగ ప్రవేశం చేశారు. ఆ తర్వాత 'తొలిప్రేమ', 'తమ్ముడు', 'బద్రి', 'ఖుషి' వంటి వరుస విజయాలతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. 'జల్సా', 'గబ్బర్‌సింగ్', 'అత్తారింటికి దారేది', 'గోపాల గోపాల', 'భీమ్లా నాయక్' చిత్రాలతోనూ విజయాలు అందుకున్నారు. ప్రస్తుతం పవన్ కల్యాణ్ రాజకీయాల్లో చురుగ్గా ఉన్నారు. నటుడిగా ఆయనకు ప్రత్యేకమైన శైలి, మేనరిజమ్స్ ఉన్నాయి. కరాటేలో బ్లాక్ బెల్ట్ సాధించిన ఆయనకు పుస్తకాలు చదవడం కూడా ఇష్టం.

## వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలన ప్రజా రంజకం

మొదటిపేజీ తరువాయి – చేసుకుంది. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ... తమ ప్రజా పాలనలో సామాన్యుల కష్టాలను తీర్చడానికే నిరంతరం కృషి చేశామని అన్నారు. రాష్ట్రంలో తీవ్ర ఆర్థిక సంక్షోభం, గత ప్రభుత్వ అప్పుల భారం ఉన్నప్పటికీ, ఏ ఒక్క సంక్షేమ పథకాన్ని ఆపకుండా ప్రజల అవసరాలకు అనుగుణంగా పాలన కొనసాగిస్తున్నామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలపై మంత్రి పొంగులేటి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గతంలో కేసీఆర్ 'వరి వేస్తే ఉరే' అన్నారని, కానీ తమ ప్రభుత్వం రాగానే వరి సాగుకు మద్దతుగా రూ.500 బోనస్ అందిస్తూ, వరి ఉత్పత్తిలో తెలంగాణను దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిపామని గుర్తుచేశారు. రైతు సంక్షేమానికై ఇప్పటికే రూ.1.76 లక్షల కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో గ్రూప్-1 ప్రశ్నాపత్రాలను అమ్ముకున్నారని ఆరోపించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన రూ.8.21 లక్షల కోట్లకు పైగా అప్పులు, నిలిచిపోయిన బకాయిలు, సర్పంచ్‌ల బకాయిలతో పాటు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ నిధులను కూడా తమ ప్రభుత్వమే చెల్లిస్తోందని పేర్కొన్నారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో పేదలకు రేషన్ కార్డులు కూడా ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన రెండేళ్లలోనే కొత్తగా 15 లక్షల రేషన్ కార్డులు మంజూరు చేసిందని తెలిపారు. అతి త్వరలోనే మరో 3 లక్షల మందికి కొత్తగా వితంతు, వృద్ధాప్య పింఛన్లు అందజేయబోతున్నామని ప్రకటించారు. కేటీఆర్ హద్దులు మీరి, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ఉద్దేశించి సంస్కారహీనంగా మాట్లాడితే ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ క్షమించరని హెచ్చరించారు. బీఆర్ఎస్ నేతలు ధరణి పేరుతో కొల్లగొట్టిన భూములు, ఆస్తులపై విచారణ జరుగుతోందని, 22ఏ భూములపై అసెంబ్లీలో చర్చకు రావాలని సవాల్ విసిరారు. నిజమైన ప్రతిపక్ష హోదాకు కేసీఆర్ పూర్తిగా అనర్హుడని విమర్శించారు.

## "ఎటు చూసినా విధ్వంసం, వికృతమే"

మొదటిపేజీ తరువాయి – వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా బీఆర్ఎస్ ఛార్జ్‌షీట్ విడుదల చేసింది. ఈ సందర్భంగా తెలంగాణ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో ఎటు చూసినా విధ్వంసం, వికృతం కనిపిస్తోందని కేటీఆర్ ఆరోపించారు. ఇది వెయ్యి రోజుల పాలన కాదని.. 'పీడన' అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ మేనిఫెస్టోను ఈ శతాబ్దపు అతిపెద్ద మోసంగా అభివర్ణించారు. పేదల భూములను నిషేధిత జాబితాలో పెట్టి 30 శాతం కమీషన్లు తీసుకుంటున్నారని ఆరోపించారు. అభివృద్ధి పనులు పెద్దగా చేయకుండానే రాష్ట్ర ప్రభుత్వం రూ.4.50 లక్షల కోట్ల అప్పులు చేసిందని విమర్శించారు.రూ.50 వేల కోట్ల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి రూ.20 వేల కోట్లు మాత్రమే చేశారని కేటీఆర్ అన్నారు. రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి దేవుళ్లపై ఒట్టు పెట్టారని గుర్తుచేశారు. మాఫీ పూర్తిగా చేయకుండా 70 శాతం మంది రైతులను మోసం చేశారని ఆరోపించారు. కేసీఆర్ తెలంగాణను అన్నపూర్ణగా మార్చారని.. కాంగ్రెస్ ప్రభుత్వం దాన్ని నాశనం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో ఢిల్లీకి మూటలు మోయడం, పదవుల కోసం కొట్లాడుకోవడం తప్ప మరేమీ లేదని కేటీఆర్ విమర్శించారు. రైతుబంధు పథకాన్ని నిలిపివేసి రాహుల్ బంధుకు ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు. గోదావరి, కృష్ణా జలాల విషయంలో తెలంగాణకు అన్యాయం జరిగితే కాంగ్రెస్‌ను వదిలిపెట్టబోమని హెచ్చరించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కక్షతో రైతులను ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. మిస్ వరల్డ్ పోటీలు, లియోనెల్ మెస్సీ కార్యక్రమాలకు భారీగా నిధులు ఖర్చు చేసిన ప్రభుత్వం, రైతులకు నీళ్లు ఇచ్చేందుకు మాత్రం డబ్బులు ఖర్చు చేయడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చిందని కేటీఆర్ గుర్తుచేశారు. జాబ్ క్యాలెండర్ పేరుతో జాబ్‌లెస్ క్యాలెండర్ ఇచ్చారని ఎద్దేవా చేశారు. ఢిల్లీలో రాహుల్ గాంధీతో కలిసి ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు.. తెలంగాణలో నిరుద్యోగులపై దాడులు చేస్తున్నారని ఆరోపించారు.

## ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన

మొదటిపేజీ తరువాయి – పలు కీలక అంశాలపై కేంద్ర మంత్రులతో చర్చలు జరిపారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించ తలపెట్టిన 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026'కు రాజ్ నాథ్ సింగ్ ను ముఖ్య అతిథిగా సీఎం ఆహ్వానించారు. ఈ గ్లోబల్ సమ్మిట్‌లో భాగమైన డిఫెన్స్ ఎక్స్‌పోలో కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ భాగస్వామ్యం వహించాలని విజ్ఞప్తి చేశారు. వీటితో పాటు, మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర వద్ద ప్రతిపాదించిన డీఆర్‌డీఎల్ ప్రాజెక్టుకు ఉచితంగా భూమి కేటాయించాలని కోరారు. ఇక ఆదిలాబాద్ విమానాశ్రయం పునరుద్ధరణ అంశాన్ని రాజ్‌నాథ్ దృష్టికి తీసుకెళుతూ.. ఈ ప్రాజెక్టు కోసం ఇప్పటికే 750 ఎకరాల భూసేకరణ పూర్తి చేశామని, అవసరమైతే మరో 750 ఎకరాలు సేకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. అనంతరం పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడితో సమావేశమైన రేవంత్ రెడ్డి... రాష్ట్రంలోని విమానాశ్రయాల విస్తరణ, అభివృద్ధిపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రధానంగా ఆదిలాబాద్, వరంగల్‌లోని మామునూరు విమానాశ్రయాల పనులను వేగవంతం చేయాలని, కొత్త విమానాశ్రయాల ప్రతిపాదనలకు అనుమతులు మంజూరు చేయాలని కోరారు. సీఎం రేవంత్ రెడ్డి వెంట మంత్రి గడ్డం వివేక్, ఎంపీలు మల్లు రవి, బలరామ్ నాయక్, అనిల్ కుమార్ యాదవ్ తదితర నేతలు ఈ భేటీలలో పాల్గొన్నారు.

### భారత్, చైనా, అమెరికా నుంచి నష్టపరిహారం కోరిన నేపాల్ మంత్రి

మొదటిపేజీ తరువాయి – ప్రపంచంలోనే అత్యధికంగా గ్రీన్‌హౌస్ వాయువులను విడుదల చేస్తున్న భారత్, చైనా, అమెరికా దేశాల నుంచి 'వాతావరణ మార్పుల నష్టపరిహారం' కోరుతూ నేపాల్ విదేశాంగ మంత్రి శిశిర్ ఖనాల్ సంచలన ప్రకటన చేశారు. భోటేకోషి నదిలో సంభవించిన ఆకస్మిక వరదల వల్ల ఇప్పటికే 1,100 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా, వేలాది మంది గల్లంతయ్యారు. ఈ తీవ్ర విపత్తు వాతావరణ మార్పుల వల్ల హిమనీనదాలు (గ్లేసియర్లు) విరుచుకుపడటం వల్లే సంభవించిందని శిశిర్ ఖనాల్ పేర్కొన్నారు. వాతావరణ మార్పులకు తమ దేశం కారణం కాకపోయినా, అతిపెద్ద పారిశ్రామిక దేశాలు విడుదల చేసే ఉద్గారాల వల్ల తాము తీవ్ర మూల్యం చెల్లించుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది తమకు ఇచ్చే సాయం లేదా భిక్ష కాదని, బాధితులకు చెల్లించాల్సిన చట్టపరమైన, నైతిక బాధ్యత అని స్పష్టం చేశారు. తమ దౌత్య విధానాన్ని 'సాయం కోరడం' నుంచి 'న్యాయం, నష్టపరిహారం పొందే' దిశగా మారుస్తున్నట్లు వెల్లడించారు. ఈ అంశాన్ని ఐక్యరాజ్యసమితి గ్లోబల్ లాస్ అండ్ డ్యామేజ్ ఫండ్ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు...

## ఎంపీ లాడ్స్ నిధుల వినియోగంపై అభాండాలు వేయడం సరికాదు

మొదటిపేజీ తరువాయి – ఎంపీ లాడ్స్ నిధుల వినియోగంలో పార్లమెంట్ సభ్యులు తీవ్రంగా వెనుకబడ్డారంటూ 'ఎంపవర్డ్ ఇండియన్' సంస్థ విడుదల చేసిన నివేదిక సత్యదూరమని, వాస్తవాలను పరిగణనలోకి తీసుకోకుండా ఎంపీలపై అభాండాలు వేయడం సరికాదని కేంద్ర మంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. ఈ మేరకు తన కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించిన ఎంపీ ల్యాడ్స్ నిధుల ఖర్చు వివరాలను ఆయన గణాంకాలతో సహా మీడియాకు వివరించారు. కేంద్ర ప్రభుత్వం తన నియోజకవర్గానికి రూ. 17.50 కోట్లు కేటాయించగా, అందులో ఏకంగా 94.1 శాతం నిధులకు (రూ. 16.47 కోట్లు) సంబంధించిన పనులు వివిధ దశల్లో పురోగతిలో ఉన్నాయని స్పష్టం చేశారు. కమ్యూనిటీ హాళ్లు, బోర్‌వెల్స్, సీసీ రోడ్ల వంటి ప్రజావసరాల కోసం గత మూడేళ్లలో 627 ప్రతిపాదనలను కలెక్టర్లకు పంపగా, వాటిలో 82.29 శాతం పనులకు ఇప్పటికే ఆమోదం లభించిందన్నారు. అంతేకాకుండా, గతంలో 16వ లోక్‌సభ సభ్యుడిగా ఉన్న బి. వినోద్ కుమార్ ఖర్చు చేయకుండా వదిలేసిన రూ. 2.5 కోట్ల నిధులను కూడా తానే ఉపయోగించినట్లు గుర్తుచేశారు. స్థానిక సమస్యల పరిష్కారానికి కేంద్రం ఇచ్చే నిధులు చాలడం లేదని, ప్రతి ఏటా ఎంపీ లాడ్స్ కోటాను పెంచాలని ఎంపీలంతా విజ్ఞప్తి చేస్తున్న తరుణంలో ఇలాంటి ఏకపక్ష నివేదికలు ఇవ్వడం అన్యాయమని సంజయ్ ఆవేదన వ్యక్తం చేశారు. నిధుల కేటాయింపు నుంచి కలెక్టర్ల ఆమోదం, పనుల అమలు వరకు అనేక దశలు ఉంటాయని... ఆర్థిక సంవత్సరం ముగియడానికి ఇంకా సమయం ఉన్నప్పటికీ నిధులన్నీ ప్రాసెస్ అయ్యాయని తెలిపారు. ప్రజల విజ్ఞప్తుల కోసం సీఎస్ఆర్ నిధులను కూడా సేకరిస్తున్నామని పేర్కొన్న ఆయన, ఇకనైనా వాస్తవాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికలు ఇవ్వాలని సదరు సంస్థకు హితవు పలికారు.

## హరీశ్‌రావునైనా క్షమిస్తానేమో కానీ.. ప్రశాంత్‌రెడ్డిని క్షమించను

మొదటిపేజీ తరువాయి – తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత.. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. అవినీతి కారణంగానే ఆ రెండు పార్టీలు మిలాఖత్ అయ్యాయని, అందుకే కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై ప్రధాన ప్రతిపక్షంగా బీఆర్ఎస్ మౌనంగా ఉందని ఆరోపించారు. సోమవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన 'పాంచజన్య సంకల్ప సభ'లో ఆమె ప్రసంగించారు. బంగారు తెలంగాణ పేరుతో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్.. పదేళ్లలో రాష్ట్రాన్ని అడ్డగోలుగా దోచుకుందని కవిత విమర్శించారు. ఆ పార్టీ హయాంలో నాలుగు ఇళ్లు మాత్రమే బంగారమయ్యాయని ఎద్దేవా చేశారు. రూ.లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా నిజామాబాద్‌లో ఒక్క ఎకరానికి కూడా నీళ్లు అందించలేకపోయారని దుయ్యబట్టారు. ఈ సందర్భంగా వ్యక్తిగత విషయాలు ప్రస్తావిస్తూ కవిత భావోద్వేగానికి గురయ్యారు. ప్రశాంత్‌రెడ్డి తనను తండ్రి నుంచి దూరం చేశారని, ఆయనకు తన ఉసురు తగులుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. హరీశ్‌రావు, సంతోష్‌రావును క్షమించినా ప్రశాంత్ రెడ్డిని మాత్రం జీవితంలో క్షమించనని స్పష్టం చేశారు. ఆడబిడ్డ కష్టాల్లో ఉంటే పుట్టింటి వాళ్లే కుట్ర చేసి తరిమేశారంటూ కన్నీటిపర్యంతమయ్యారు. తాను ఏ తప్పూ చేయకపోయినా నాలుగేళ్లుగా ఈడీ, సీబీఐలతో వేధించి తీహార్ జైలులో పెట్టారని కవిత అన్నారు. తాను నిర్దోషినని సుప్రీంకోర్టే చెప్పిందని, దేశ చరిత్రలోనే తొలిసారిగా ఒక సీబీఐ అధికారిపైనే విచారణకు ఆదేశించిందని గుర్తుచేశారు. ప్రజల జీవితాల్లో మార్పు కోసమే పంతం పట్టి పార్టీ పెట్టానని, పదవుల కోసం కాదని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులైనా ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని, ప్రతిపక్షంగా బీఆర్ఎస్ నిద్రపోతోందని విమర్శించారు.

## నేపాల్ వరద బాధితులకు అండగా సోనూ సూద్

మొదటిపేజీ తరువాయి ఆకస్మిక వరద బాధితులను ఆదుకునేందుకు ఆయన నేరుగా రంగంలోకి దిగారు. వేలాది మంది ప్రాణాలు కోల్పోయి, లక్షలాది మంది నిరాశ్రయులైన వేళ, వారికి అండగా నిలిచేందుకు నిత్యావసర సరుకులతో కూడిన సహాయ సామగ్రితో నేపాల్ రాజధాని ఖాట్మండు చేరుకున్నారు. అక్కడి సహాయక చర్యల్లో చురుగ్గా పాల్గొంటూ బాధితులకు ధైర్యం చెబుతున్నారు. ఈ సందర్భంగా 'ఎన్డీటీవీ'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో సోనూ సూద్ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. సహాయక శిబిరాల్లోని పరిస్థితులు, ముఖ్యంగా చిన్నారుల దుస్థితి చూసి తన హృదయం ముక్కలైందని ఆవేదన వ్యక్తం చేశారు. "వారు మన సహాయం కోసం ఎదురుచూస్తున్నారు. సహాయక శిబిరాల్లో ఎందరో చిన్నారులు తమ కుటుంబాలతో ఉన్నారు. కానీ, వారి తల్లిదండ్రులు కనిపించడం లేదు. వారిని చూస్తుంటే గుండె తరుక్కుపోతోంది. ప్రకృతి విపత్తు ముందు మనమంతా నిస్సహాయులం అనిపిస్తోంది" అని ఆయన అన్నారు. ఒక సహాయక శిబిరంలో తనను కదిలించిన సంఘటనను సోనూ సూద్ పంచుకున్నారు. తలదాచుకుంటున్న ఒక ప్రదేశానికి వెళ్లాను. అక్కడ క్రిస్టినా అనే 8-9 ఏళ్ల బాలికను కలిశాను. తన తమ్ముడితో ఉన్న ఆ చిన్నారి ముఖంలో చిరునవ్వు చెరగలేదు. 'అంతా సర్దుకుంటుంది' అని నాతో చెప్పింది. నేను అక్కడి నుంచి తిరిగి నా కారు ఎక్కేంత వరకు ఆ పాప నన్నే అనుసరించింది. ఆ చిన్నారిని దత్తత తీసుకోవాలని, తన కోసం ఏదైనా చేయాలని అనిపించింది. కానీ ఏమీ చేయలేని నిస్సహాయ స్థితి. అందుకే మనలో ప్రతి ఒక్కరం మనకు తోచినంత సహాయం చేయడం చాలా ముఖ్యం. అది ఎన్నో మార్పులను తీసుకొస్తుంది" అని వివరించారు. ఈ విపత్కర సమయంలో ప్రజలు ఎలా స్పందించాలని అడగ్గా.. "మనం సురక్షితమైన ప్రదేశాల్లో ఉన్నందుకు అదృష్టవంతులం. మీరు ఎంత బిజీగా ఉన్నా, కాస్త సమయం కేటాయించి, సర్వం కోల్పోయిన ఈ కుటుంబాల గురించి ఆలోచించండి. వారికి కొంత విరాళం పంపండి, మీకు సాధ్యమైనది ఏదైనా పంపండి. కేవలం నేపాల్ అనే కాదు, ఎక్కడ విపత్తు వచ్చినా ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి. ఇది కేవలం ప్రభుత్వాలు, మంత్రుల బాధ్యత అని అనుకోకూడదు. ఒక మనిషిగా, ఒక భారతీయుడిగా మంచి చేయడం మనందరి కర్తవ్యం" అని సోనూ సూద్ పిలుపునిచ్చారు. నేపాల్ చేరుకున్న తర్వాత స్థానికులతో ఉన్న చిత్రాన్ని ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకుంటూ.. "వారు తమ ఇళ్లను, కుటుంబాలను, బాల్యాన్ని కోల్పోయారు.

## గోదారమ్మకు సాష్టాంగ ప్రణామం






మంత్రులు నిమ్మల రామానాయుడు, వంగలపూడి అనిత, కొల్లు రవీంద్ర, నారాయణ, అచ్చెన్నాయుడు, కొలుసు పార్థసారథి, ఎంపీలు చింతకాయల విజయ్, సీఎం రమేశ్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఆయన గోదావరి జలాలను ఉత్తరాంధ్ర జిల్లాలకు విడుదల చేశారు. ఈ సందర్భంగా సాంప్రదాయ కోలాటంతో కళాకారులు ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలికారు. రూ.4,192 కోట్ల వ్యయంతో నిర్మించిన పోలవరం ఎడమ కాలువ ద్వారా విడుదల చేసిన ఈ నీటితో నాలుగు జిల్లాల పరిధిలో 2.87 లక్షల ఎకరాలకు సాగునీరు, 9 లక్షల మందికి తాగునీరు అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. మొత్తం 23.44 టీఎంసీల గోదావరి జలాలతో విశాఖ, అనకాపల్లి జిల్లాల్లోని పారిశ్రామిక, తాగు, సాగునీటి అవసరాలు తీరనున్నాయి. ఈ నీటితో అనకాపల్లి వద్ద ఏలేరు కాలువతో పాటు జిల్లాలోని 110 చెరువులను నింపేందుకు జలవనరుల శాఖ ప్రణాళికలు సిద్ధం చేసింది. దీనివల్ల పుష్కర, ఏలేరు, పంపా, తాండవ, వరహా, మామిడిగెడ్డ ఆయకట్టు కింద ఉన్న మొత్తం 46,620 ఎకరాలు స్థిరీకరణ కానున్నాయి. గోదావరి జలాలు తమ ప్రాంతానికి రావడంతో స్థానిక ప్రజలు, రైతులు ఆనందోత్సాహాలతో పులకించిపోయారు. కాలువకు ఇరువైపులా నిల్చుని ప్రవాహానికి అడుగడుగునా పుష్పాంజలి ఘటిస్తూ, హారతులు పడుతూ గోదారమ్మకు స్వాగతం పలికారు. తమ ప్రాంతానికి గోదావరి జలాలను తీసుకువచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు రైతు సోదరులు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ముఖ్యమంత్రి అక్కడున్న ప్రజాప్రతినిధులు, అధికారులందరినీ స్వయంగా పిలిచి శిలాఫలకం వద్ద గ్రూప్ ఫోటోలు దిగారు.

## సావర్కర్‌కు ముస్లింలంటే ద్వేషం లేదు

మొదటిపేజీ తరువాయి – పురోభివృద్ధికి తన రచనల్లో దిశానిర్దేశం చేశారని ఆయన మనవడు సాత్యకి సావర్కర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తన వ్యాఖ్యల ద్వారా సావర్కర్‌ను తీవ్ర ముస్లిం ద్వేషిగా చిత్రీకరించారని ఆయన ఆరోపించారు. రాహుల్ గాంధీపై సాత్యకి దాఖలు చేసిన పరువునష్టం దావాకు సంబంధించి ప్రత్యేక కోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా సాత్యకిని అడ్వకేట్ మిలింద్ పవార్ క్రాస్ ఎగ్జామినేషన్ చేశారు. 2023లో లండన్‌లో రాహుల్ గాంధీ మాట్లాడుతూ, "సావర్కర్ తన ఐదారుగురు స్నేహితులతో కలిసి ఒక ముస్లిం యువకుడిపై దాడి చేసి ఆనందం పొందానని తన పుస్తకంలో రాసుకున్నారు" అని అన్నట్లు సాత్యకి గుర్తుచేశారు. ఈ వ్యాఖ్యల ద్వారా సావర్కర్‌ను ఒక మూకదాడికి పాల్పడే వ్యక్తిగా చూపారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. "ఈ మాటల వల్ల సావర్కర్‌ను తీవ్ర ముస్లిం వ్యతిరేకిగా చిత్రీకరించారు. కానీ ఆయనెప్పుడూ ముస్లింలను ద్వేషించలేదు. తన రచనల్లో వారి అభివృద్ధికి మార్గాలు సూచించారు" అని సాత్యకి కోర్టుకు వివరించారు. రాహుల్ గాంధీ పేర్కొన్నట్లుగా ముస్లిం యువకుడిపై దాడి జరిగిన ఘటన సావర్కర్ రాసిన ఏ పుస్తకంలోనూ లేదని ఫిర్యాదుదారు స్పష్టం చేశారు. ఈ కేసుకు సంబంధించి తదుపరి విచారణ కొనసాగుతోంది.

## విమానయాన సంస్థలకు జెలెన్‌స్కీ హెచ్చరిక.. ఉగ్రవాదులతో చర్చలు ఉండవన్న పుతిన్

మొదటిపేజీ తరువాయి – చేయడానికి సిద్ధమైనట్లు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ప్రకటించడం అంతర్జాతీయంగా కలకలం రేపుతోంది. ఏ క్షణంలోనైనా ఈ దాడులు ప్రారంభమయ్యే అవకాశం ఉన్నందున రష్యా గగనతలం పౌర విమానయానానికి ఎంతమాత్రం సురక్షితం కాదని, మాస్కోలోని విమానాశ్రయాలు కూడా తమ లక్ష్యాలలో భాగమేనని ఆయన స్పష్టం చేశారు. పౌర విమానాలు తమ టార్గెట్ కాదనే ఉద్దేశంతోనే ముందస్తుగా ఈ బహిరంగ హెచ్చరిక జారీ చేశామని, అంతర్జాతీయ విమానయాన సంస్థలు, విదేశీ ప్రభుత్వాలు ఈ పరిస్థితిని తీవ్రంగా పరిగణించి ఆ ప్రాంతంలో ప్రయాణాలను తక్షణమే నిలిపివేయాలని విజ్ఞప్తి చేశారు. రష్యా స్వయంగా ప్రారంభించిన యుద్ధం వల్లే నేడు ఆ దేశానికి ఈ దుస్థితి ఎదురైందని ఆయన వ్యాఖ్యానించారు. జెలెన్‌స్కీ చేసిన ఈ బహిరంగ హెచ్చరికలపై రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఉక్రెయిన్ వైఖరి ఉగ్రవాదుల తీరును తలపిస్తోందని ఆరోపించారు. అంతర్జాతీయంగా తమపై ఎంత ఒత్తిడి వచ్చినా, ఉగ్రవాద తరహా చర్యలకు పాల్పడుతున్నవారితో ఎలాంటి చర్చలు జరిపే ప్రసక్తే లేదని పుతిన్ తెగేసి చెప్పారు. ఈ పరిణామాల మధ్యనే మంగళవారం రాత్రి ఉక్రెయిన్ రాజధాని కీవ్‌పై రష్యా జరిపిన విధ్వంసకర దాడుల్లో 12 మంది పౌరులు ప్రాణాలు కోల్పోగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. మరోవైపు, రష్యా సైన్యంలో చేరిన 51 మంది భారతీయులు ఈ యుద్ధంలో మృతి చెందినట్లు వెలువడిన వార్తలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి.

## చిత్వాన్ జిల్లాలో అత్యధికంగా 348 మృతదేహాల వెలికితీత

**గల్లంతై ఆచూకీ లేకుండా పోయారు.**



మొదటిపేజీ తరువాయి – **బాధిత ప్రాంతాల్లో పరిస్థితి – సహాయక చర్యల వివరాలు:** చిత్వాన్ జిల్లాలో అత్యధికంగా 348 మృతదేహాలను వెలికితీయగా, నవల్‌పరాసి ఈస్ట్‌లో 217, నవల్‌పరాసి వెస్ట్‌లో 190, నువాకోట్‌లో 155 మంది ప్రాణాలు కోల్పోయారు. అలాగే ఇతర జిల్లాలైన ధాడింగ్, గోర్ఖా, రసువా, తనాహులలోనూ భారీగా ప్రాణనష్టం సంభవించింది. భారీ ఎత్తున సహాయక చర్యలు: బాధితుల కోసం సుమారు 7,912 మంది పోలీసు సిబ్బందిని రంగంలోకి దించారు. ఇప్పటివరకు వివిధ వరద ప్రభావిత ప్రాంతాల నుంచి 6,541 మందిని రెస్క్యూ టీమ్‌లు సురక్షితంగా రక్షించాయి. భారత్, చైనా నిపుణుల భాగస్వామ్యం: భోటే కోషి నది పొంగిపొర్లడంతో రసువా వద్ద ఉన్న కీలకమైన జలవిద్యుత్ ప్రాజెక్టులు, భూగర్భ టన్నెళ్లలో చిక్కుకున్న వారిని రక్షించేందుకు నేపాల్ ఆర్మీతో పాటు భారత్, చైనాలకు చెందిన టన్నెల్ రెస్క్యూ నిపుణులు రంగంలోకి దిగారు.అస్తిత్వ గుర్తింపు, డీఎన్ఏ నమూనాలు: ఇప్పటివరకు లభ్యమైన మృతదేహాల్లో కేవలం 95 మృతదేహాలను మాత్రమే కుటుంబ సభ్యులు గుర్తించి తీసుకెళ్లారని నేపాల్ ప్రధాని బాలెన్ షా తెలిపారు. గుర్తు పట్టలేని విధంగా ఉన్న శవాలకు డీఎన్ఏ నమూనాలు సేకరించి భద్రపరుస్తున్నట్లు పేర్కొన్నారు.

TG/TEL/25/A3731
నిజం
దృష్టి తెలుగు న్యూస్
గురువారం 03- 09 - 2026

## వైఎస్ రాజశేఖర రెడ్డి వర్ధంతి సందర్భంగా కడెంలో ఘన నివాళులు



ఖానాపూర్ నియోజకవర్గం సెప్టెంబర్ 02 నిజం న్యూస్:మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి వర్ధంతి సందర్భంగా కడెం మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బొడ్డు గంగన్న ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు బొడ్డు గంగన్న, ఏఎంసీ చైర్మన్ భూషణ్, ఆర్టీఏ సభ్యులు మల్లేశ్ యాదవ్ మాట్లాడుతూ వైఎస్ఆర్ ప్రజల సంక్షేమం కోసం చేసిన సేవలను స్మరించుకున్నారు. ఆయన ఆశయాలను కొనసాగించడం ప్రతి కాంగ్రెస్ కార్యకర్త బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో కడెం మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు బాబ్లూ, ఎస్సీ డిపార్ట్మెంట్ మండల అధ్యక్షులు జడా రాజేశ్వర్, మైనారిటీ డిపార్ట్మెంట్ మండల అధ్యక్షులు సలీం, మండల ప్రధాన కార్యదర్శి ముస్కు రాజేంద్ర్, సర్పంచులు జంగు, భూమన్న, ఆత్మ డైరెక్టర్ శేఖర్, పెద్దూరు గ్రామ కమిటీ అధ్యక్షులు వసియోద్దీన్, నాయకులు దులే వెంకటేశ్, చింతం రాజన్న, దులే గంగాధర్, నారాయణ, లక్ష్మణ్, లచ్చన్నతో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## భక్తి పారవశ్యంలో పోచమ్మ తల్లి బోనాల ఉత్సవాలు ఘనంగా

బోనాలతో అమ్మవారికి మొక్కులు చెల్లించిన మహిళలు..భక్తులతో కిటకిటలాడిన ఆలయ ప్రాంగణం



పరకాల, సెప్టెంబర్ 02 నిజం న్యూస్: పరకాల పట్టణంలోని 10వ వార్డులో పోచమ్మ తల్లి బోనాల ఉత్సవాలు భక్తిశ్రద్ధల నడుమ అత్యంత ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక బోనాలు సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. సంప్రదాయ దుస్తులు ధరించిన మహిళలు రంగురంగుల బోనాలను అందంగా అలంకరించి, డప్పు చప్పుళ్లు, భక్తి గీతాల నడుమ ఊరేగింపుగా పోచమ్మ తల్లి ఆలయానికి చేరుకున్నారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. పోచమ్మ తల్లి కృపాకటాక్షాలతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని భక్తులు ప్రార్థించారు. బోనాల ఉత్సవాలకు హాజరైన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, ప్రసాదం తదితర సౌకర్యాలను నిర్వాహకులు ఏర్పాటు చేశారు. భక్తుల కోలాహలం, డప్పు చప్పుళ్లు, అమ్మవారి నామస్మరణల మధ్య వైభవంగా సాగిన పోచమ్మ తల్లి బోనాల ఉత్సవాలు పరకాల 10వ వార్డులో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పాయి.

## మిత్రుడి ఆన్లైన్ సెంటర్ ను సందర్శించిన శేఖర్ సేనాపతి టీమ్




వేములవాడ టౌన్ సెప్టెంబర్ 02 నిజం న్యూస్: రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రం లో మిత్రుడు మారుపాక హరీష్ ఏర్పాటుచేసిన విద్య ఆన్లైన్ సర్వీస్ సెంటర్ ను సందర్శించిన శేఖర్ సేనాపతి అండ్ టీం ఎల్లారెడ్డిపేట మండల గ్రామీణ ప్రాంతాల వారికి ఆన్లైన్ లో సులువైన విధంగా సేవల కోసం విద్య ఆన్లైన్ సర్వీస్ ప్రారంభించామని మిత్రుడు హరీష్ తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా శేఖర్ సేనాపతి మాట్లాడుతూ మిత్రుడు హరీష్ చాలాకాలంగా మా యువచైతన్య దీపం ఫౌండేషన్ సేవా కార్యక్రమాలు ప్రతిరోజు జిల్లా వాట్సాప్ గ్రూప్ లో వీక్షిస్తూ ఎల్లారెడ్డిపేట మండలంలో కూడా ఫౌండేషన్ సభ్యులను ఏర్పాటు చేస్తున్నట్టు ఈ సందర్భంలో టీమ్ రాజన్న సిరిసిల్ల జిల్లా గ్రూప్ కు కూడా జిల్లా నుండి సరైన యువతను మోటివేట్ చేస్తు సమాజాన్ని ఐక్యత చైతన్యం వైపు నడిపిస్తామని మాకు ఈ సందర్భంలో తెలియజేశారు. ఈ కార్యక్రమానికి శేఖర్ సేనాపతి టీం సభ్యులు ఎండి ఫిరోజ్ బత్తుల శ్యామ్ చరణ్ తదితరులు పాల్గొనడం జరిగింది.

## గుండె పోటు తో జక్కుల వెంకన్న మృతి

అరణ్య రోదనల మధ్య కుటుంబ సభ్యులు...

కుమారులు నరేష్ సురేష్ శంకర్ రోదనలు...

కార్దేవ దేహానికి పూలమాలసి నివాళులర్పించిన మండల అధ్యక్షులు...



కురవి సెప్టెంబర్ 02 నిజం న్యూస్: కురవి మండలం లోని మోదుగుల గూడెం గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన జక్కుల వెంకన్న గుండె పోటు తో మరణించారు.విషయం తెలుసుకున్న వెంటనే కురవి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బాలగాని శ్రీనివాస్ వచ్చి పార్థివ దేహం పై పూల మాల వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ చింతమల్ల ప్రవీణ్ కుమార్,ఉపసర్పంచ్ దయ్యాల శ్రీధర్ గౌడ్,గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అనబత్తుల ఉపేందర్, గ్రామ యూత్ అధ్యక్షులు ఎస్ కె మహిమూద్, గ్రామ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు కందిపాటి వీరన్న,మాజీ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కోడి రాములు,మాధ మల్లయ్య,గ్రామ బి ఎల్ ఓ మాధ శ్రీకాంత్,కందిపాటి బాబు,దేవనబోయిన వీరేష్ (రేవంత్ రెడ్డి),కురవి మండల కాంగ్రెస్ పార్టీ యూత్ ఉపాధ్యక్షులు కొర్ని అనిల్,రజక సంఘం జిల్లా అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు చిన్నూరి వెంకన్న, అనబత్తుల వెంకటేష్, అనబత్తుల వీరేందర్,అనబత్తుల యాకన్న, అనబత్తుల నాగన్న,కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సైబర్ జాగృతి ఉత్సవాలు

-కళాశాల విద్యార్థులకు సైబర్ నెరాలపై అవగాహన కల్పించిన ఎస్ఐ ఉదయ్ కిరణ్




జన్నారం సెప్టెంబర్ 02 నిజం న్యూస్: సైబర్ జాగృతి ఉత్సవాలను బుధవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల జన్నారం నందు సైబర్ అవగాహన సదస్సు నిర్వహించారు. ముందుగా కళాశాల ప్రిన్సిపాల్ ఎం విజిత్ కుమార్ సార్ విద్యార్థులను ఉద్దేశించి క్రమశిక్షణగా చదువుకొని, ఎలాంటి నేరాలకు గురి కాకుండా తల్లిదండ్రులకు అధ్యాపకులకు మంచి పేరు తీసుకురావాలని మాట్లాడారు. సైబర్ అవగాహన సదస్సు సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ జన్నారం ఉదయ్ కిరణ్ సైబర్ నెరగాలపట్ల చాలా జాగ్రత్తగా ఉంటూ మీ తల్లిదండ్రులకు అవగాహన కలిగించే విధంగా ఉండాలని వివరించారు. వారు మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్, మద్యపానం, సేవించి టూ వీలర్ ఫోర్ వీలర్ వెహికల్స్ నడపకూడదు అని విద్యార్థులకు వివరించారు, మేము ముందు అవగాహన కల్పిస్తాం తర్వాత సమాజంలో ఉన్న పౌరులు వినకుండా ఉన్నట్లయితే చట్టం తన పని తను చేసుకుంటూ ముందుకు వెళుతుంది, చట్టం ముందు అందరూ సమానులే నేటి బాలలు రేపటి బావిపౌరులు, సమాజ అవగాహన ఉండాలని చిన్నచిన్న నేరాలు చేస్తూ ఉండకుండా క్రమశిక్షణగా చదువుకుంటూ ఉండాలని బోధించారు మీకు ఏమైనా సమస్య ఉంటే మా టోల్ ఫ్రీ నెంబర్ 112 కు కాల్ చేసి మాట్లాడవచ్చు అని వివరించారు. ప్రియమైన విద్యార్థులారా మీరు క్రమశిక్షణగా చదువుకొని మీ తల్లిదండ్రులకు అధ్యాపకులకు మంచి పేరు తీసుకురావాలని బోధించారు. గణపతి ఉత్సవాలు, కావచ్చు దసరా పండుగ కావచ్చు, దీపావళి పండుగ కావచ్చు, సంక్రాంతి పండుగ కావచ్చు, ఈ ఉత్సవాలలో సైబర్ నెరగాళ్లు మనకు ఏదో ఒకటి ఆశ చూపి ఇందులో క్లిక్ చేసినట్లయితే మన డాటా ఆటోమేటిక్గా సైబర్ నేరగాళ్లకు అందుతుంది కాబట్టి విద్యార్థులారా చాలా జాగ్రత్తగా ఉండాలని ఉదయ్ కిరణ్ విద్యార్థులకు బోధించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం జి బాపూరావు, ఎం రవీందర్, ఎం సాయికుమార్ , వై నాగేశ్వరరావు, ఎచ్ మోహన్, ఎ దేవేందర్, సిఎచ్ శశికళ, డి స్వరూప, బి కర్ణాకర్, ఎం కుమారస్వామి, ఎన్ శివరాం, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## జనం గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహానేత వైఎస్ఆర్

రైతు సంక్షేమమే లక్ష్యంగా చారిత్రాత్మక నిర్ణయాలు..

తెలుగు ప్రజల ఆరాధ్య దైవం వైఎస్ఆర్..

వైఎస్ఆర్సీపీ యువ నాయకులు శీలం శ్రీను..

శీలం శ్రీను ఆధ్వర్యంలో షాద్ నగర్ లో వైఎస్ఆర్ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు..






నిజం న్యూస్ ప్రతినిధి, షాద్ నగర్, సెప్టెంబర్ 02 : తెలుగు రాష్ట్రాల జనం గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన మహన్ననేత, మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి అని వైస్సార్సీపీ యువనేత శీలం శ్రీను అభిప్రాయపడ్డారు. బుధవారం ఈ మేరకు వైఎస్ఆర్ వర్ధంతి కార్యక్రమాన్ని షాద్నగర్ పట్టణంలో శీలం శీను ఆధ్వర్యంలో వైఎస్ఆర్ 17వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా షాద్ నగర్ లో వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం శీలం శ్రీను మాట్లాడుతూ.. తెలుగు ప్రజల గుండెల్లో కొలువైన మహా నాయకుడు వైయస్ రాజశేఖర రెడ్డి అని పేర్కొన్నారు. రాజశేఖర్ రెడ్డి అంటే సంక్షేమం.. సంక్షేమం అంటే రాజశేఖర రెడ్డి అని కొనియాడాడు. వైఎస్ రాజశేఖరరెడ్డి 2009వ సంవత్సరం, సెప్టెంబర్ 2వ తేదీన రచ్చబండ కార్యక్రమానికి హాజరవుతూ నల్లమల అటవీ ప్రాంతంలోని పావురాలగుట్టలో జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో మరణించారని, 2004 నుంచి 2009 వరకు ఆయన ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆరోగ్య శ్రీ, ఫీజు రీయింబర్స్మెంట్, రైతులకు ఉచిత విద్యుత్, రుణమాఫీ పథకాలను ప్రవేశపెట్టి ప్రజల గుండెల్లో చిరకాలం నిలిచిపోయారన్నారు. ఆయన మరణించి 17 సంవత్సరాలు అవుతున్నా ప్రజల గుండెల్లో ఇప్పటికీ చెరగని ముద్ర వేశారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ విరాభిమాని రమాదేవి, నాయకులు పత్తి సంతోష్, భైరంపల్లి ఉప సర్పంచ్ కుంటోళ్ల నరేష్, జహంగీర్, ఈదులపల్లి నర్సింహా, మనసాని రాంరెడ్డి, ఇసాక్, ఆవ శివ, చెన్నయ్య గౌడ్, ప్రవీణ్, సందీప్, ప్రకాష్ చారి, వెంకటేష్, గిరిబాబు, శ్రీనివాస్ రెడ్డి, నయూమ్ మరియు వైఎస్ఆర్ అభిమానులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మకూర్ పోలీస్ స్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా బాబు లాల్ బాధ్యతల స్వీకరణ

కాంగ్రెస్ ఎన్నికల హామీలను ప్రజలకు మరోసారి గుర్తు చేస్తూ 420 మీటర్ల భారీ ఫ్లెక్స్ తో ర్యాలీ



నిజం న్యూస్ ప్రతినిధి, మేడిపల్లి,సెప్టెంబర్ 02: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తవుతున్న సందర్భంగా.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమం పీర్జాదిగూడలో ఘనంగా జరిగింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు.. మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ ఎన్నికల హామీలను ప్రజలకు మరోసారి గుర్తు చేస్తూ 420 మీటర్ల భారీ ఫ్లెక్సీతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాల్సిన హామీలు, బాకీగా ఉన్న హామీలను వివరిస్తూ బాకీ కార్డులు, కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో తాగునీరు, విద్యుత్ వంటి కనీస అవసరాల విషయంలో కూడా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు, పథకాల వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని తెలిపారు. మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి మాట్లాడుతూ..420 హామీలను ప్రజల ముందుంచి.. వాటి అమలు పరిస్థితిని ప్రజలకు వివరించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని రాబోయే ఏడు రోజుల పాటు రోజుకొక నిరసన కార్యక్రమం నిర్వహించి.. ప్రభుత్వంపై పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఏదవల్లి రఘువర్ధన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు దొంతిరి హరిశంకర్ రెడ్డి, కొల్తూరి మహేష్, మధుసూదన్ రెడ్డి, కౌడే పోచయ్య, మహిళా అధ్యక్షురాలు నిర్మల, వర్కింగ్ ప్రెసిడెంట్ ఏనుగు మనోరంజన్ రెడ్డి, యూత్ అధ్యక్షులు ప్రభు, జావీద్ ఖాన్, శ్యామల శ్రీనివాస్, యు బి ఏ అధ్యక్షులు ఆకుల సత్యనారాయణతో డివిజన్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 1000 రోజులైనా నెరవేరని హామీలు

కాంగ్రెస్ మోసాలపై పరకాలలో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిఆధ్వర్యంలోభారీ నిరసన ర్యాలీ



పరకాల సెప్టెంబర్ 02 నిజం న్యూస్: కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలన వైఫల్యాలను నిరసిస్తూ పరకాలలో మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ కూడలి నుండి కూరగాయల మార్కెట్ వరకు కాంగ్రెస్ ప్రభుత్వ 6 గ్యారంటీల వైఫల్యాలను ఎండగడుతూ ఏర్పాటు చేసిన 420 అడుగుల భారీ ఫ్లెక్సీతో ర్యాలీ చేపట్టారు. ఈ నిరసన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. అనంతరం పరకాల బస్టాండ్ వద్ద బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన 6 గ్యారంటీలు, రైతు రుణమాఫీ, 2 లక్షల ఉద్యోగాల కల్పన, రైతు భరోసా వంటి హామీలు ప్రజలను మభ్యపెట్టేందుకు ఇచ్చినవేనని ఆరోపించారు. ఎన్నికల సమయంలో అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ప్రతి హామీని అమలు చేస్తామని బాండ్ పేపర్లపై రాసి ఇచ్చిన కాంగ్రెస్ నాయకులు, 1000 రోజులు గడుస్తున్నా హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. రైతులకు సకాలంలో అందించాల్సిన యూరియాను అందించకుండా కొత్త యాప్ విధానాన్ని తీసుకువచ్చి రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. యాప్ కారణంగా రైతులు ఒక మండలం నుండి మరో మండలానికి తిరగాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పరకాల నియోజకవర్గ అభివృద్ధిని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని చల్లా ధర్మారెడ్డి ధ్వజమెత్తారు. ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా, పరకాల నియోజకవర్గంలో మరింత ఉధృతంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## కాంగ్రెస్ 420 హామీలకు 'బాకీ కార్డు'!

వెయ్యి రోజులు గడిచినా హామీల అమలేది?

420 అడుగుల ఫ్లెక్సీతో మెదక్‌లో బీఆర్ఎస్ నిరసన



మెదక్, సెప్టెంబర్ 02 నిజం న్యూస్: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు వెయ్యి రోజులు పూర్తవుతున్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని మాజీ డిప్యూటీ స్పీకర్ యం. పద్మాదేవేందర్‌రెడ్డి విమర్శించారు. హామీల అమలులో ప్రభుత్వ వైఫల్యాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మెదక్‌లో భారీ నిరసన చేపట్టారు. పద్మాదేవేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు కంఠరెడ్డి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు అంబేద్కర్ చౌరస్తా నుంచి రాందాస్ చౌరస్తా వరకు 420 అడుగుల ఫ్లెక్సీతో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ధర్నా చేపట్టి ప్రజలకు 'బాకీ కార్డులు' పంపిణీ చేశారు. పద్మాదేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. మహిళలకు నెలకు రూ.2,500, పింఛన్‌ను రూ.4 వేలకు పెంపు, కల్యాణలక్ష్మి కింద తులం బంగారం వంటి హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. రైతుబంధు, రైతుబీమా, రుణమాఫీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలోనూ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. "మాటలు కోటలు దాటుతున్నాయి.. కాళ్లు మాత్రం కదలడం లేదు" అని విమర్శించారు. శేరి సుభాష్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఇచ్చిన హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. రైతులకు రుణమాఫీ సక్రమంగా జరగలేదని, రైతుబంధు, రైతుబీమా అమలులోనూ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. కంఠరెడ్డి తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. వెయ్యి రోజుల్లో ప్రజలకు చెప్పుకోదగ్గ మేలు జరగలేదని విమర్శించారు. అమలు కాని హామీలను నెరవేర్చే వరకు ప్రభుత్వంపై పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్లు ఆరేళ్ల మల్లికార్జున్‌గౌడ్, బట్టి జగపతి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకిరెడ్డి కృష్ణారెడ్డి, పట్టణ పార్టీ కన్వీనర్ మామిళ్ల ఆంజనేయులు, కౌన్సిలర్లు, వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు, మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అల్లాపూర్‌లో డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి

డివైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు అంతటి మహేశ్ డిమాండ్



సెప్టెంబర్ 02 నిజం న్యూస్: తాడూర్ మండలం అల్లాపూర్ గ్రామంలోని డ్రైనేజీ సమస్యను అధికారులు వెంటనే పరిష్కరించాలని డివైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు అంతటి మహేశ్ డిమాండ్ చేశారు. ముఖ్యంగా ఎస్సీ, దళిత వాడల్లో మురుగునీరు రోజుల తరబడి నిల్వ ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని ఇప్పటికే పలుమార్లు సర్పంచ్, గ్రామ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని అంతటి మహేశ్ ఆరోపించారు. మురుగునీరు నిల్వ ఉండటంతో దోమలు విపరీతంగా పెరిగి, ప్రజల ఆరోగ్యానికి ముప్పు ఏర్పడుతోందని అన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఎస్సీ, దళిత వాడల్లో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడంతో పాటు, ప్రస్తుతం నిల్వ ఉన్న మురుగునీటిని తక్షణమే తొలగించాలని ఆయన కోరారు. అధికారులు వెంటనే స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంతటి పర్వతాలు, అంతటి శాంతమ్మ, అంతటి భారతమ్మ, గొల్ల నీలయ్య తదితరులు పాల్గొన్నారు.

## స్వర్గీయ వైయస్ రాజశేఖర్ రెడ్డి 17 వ వర్ధంతి వేడుకలు




పెద్దపల్లి, ఆర్సి సెప్టెంబర్ 02 నిజం న్యూస్: పెద్దపల్లి పట్టణంలోని గాంధీ విగ్రహం వద్ద,పెద్దపల్లి శాసనసభ్యులు,ప్రభుత్వ విప్, చింతకుంట విజయ రమణారావు ఆదేశాల మేరకు పట్టణ అధ్యక్షులు.బూతగడ్డ సంపత్ ఆధ్వర్యంలో,స్వర్గీయ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి17వ వర్ధంతి,కాంగ్రెస్ పార్టీ ఘన నివాళులర్పించడం జరిగినది. కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ,స్వర్గీయ వైయస్ రాజశేఖర్ రెడ్డి,పేద ప్రజల సంక్షేమం కోసం,అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన,గొప్ప మహానీయుడు,రైతులకు ఉచిత కరెంటు,విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్, జలయజ్ఞం,ఇందిరమ్మ ఇండ్లు, 108 విద్యా వైద్యం ఉపాధి లాంటి అనేక సంక్షేమ పథకాలు,ప్రవేశపెట్టి,పింఛన్లు, క్షేత్రస్థాయిలో పేద ప్రజలకు కృషి చేసిన మహనీయుడు.ఈ కార్యక్రమంలో,బీసీ సెల్,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,బొడ్డుపల్లి శ్రీనివాస్,రాష్ట్ర మైనార్టీ ప్రధాన కార్యదర్శి,సయ్యద్ మస్రత్, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు, అక్బర్,మున్సిపల్ కౌన్సిలర్లు, నాంసాని శ్రీనివాస్,మంతెన నర్సింగ్,దొడ్డుపల్లి జగదీష్,టి. సుభాష్ రావు,సంసిర్ బేగ్, ఇమ్రాన్,తాడూరు శ్రీమాన్, కమల్,పూరీల్లా సుధాకర్,తిర్రి రాజేందర్,సల్మాన్,నెత్తెట్ల కుమార్,గంగుల వెంకటేశం, కాజా పాషా ,క్రాంతి, మానుపాటి రవి,నక్క సతీష్, ముక్కెర రాజేశం తదితరులు పాల్గొన్నారు.

# టీసీఎస్ లాభం 12,380 కోట్లు

దేశీయ ఐటీ దిగ్గజం టీసీఎస్ అంచనాలకుమించి రాణించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికిగాను సంస్థ రూ.12,380 కోట్ల నికర లాభం ఆర్జించింది. క్రితం ఏడాది ఇదే సమయంలో నమోదైన రూ.11,058 కోట్ల లాభంతో పోలిస్తే 11.95 శాతం ఎగబాకింది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 5.6 శాతం ఎగబాకి రూ. 60,583 కోట్ల నుంచి రూ.63,973 కోట్లకు చేరుకున్నట్లు బీఎస్ఈకి సమాచారం అందించింది. సెప్టెంబర్ త్రైమాసికంలో నమోదైన రూ.64,259 కోట్లతో పోలిస్తే భారీగా తగ్గింది. గత త్రైమాసికంలో కొత్తగా 10.2 బిలియన్ డాలర్ల విలువైన ఆర్డర్లు వచ్చాయని కంపెనీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ కే కృతివాసన్ తెలిపారు.

సంస్థకు భారత్ నుంచి సమకూరిన ఆదాయంలో 70 శాతం పెరుగుదల నమోదైంది. మొత్తం ఆదాయంలో ఈ వాటా 9 శాతంగా ఉన్నది.

గత త్రైమాసికంలో బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా రంగాల నుంచి 3.2 బిలియన్ డాలర్ల విలువైన ఆర్డర్లు లభించాయి.

గత మూడు నెలల్లో సంస్థ నుంచి 5 వేల మంది సిబ్బంది వెళ్లిపోయారు. దీంతో మొత్తం ఉద్యోగుల సంఖ్య 6.07 లక్షలుగా ఉన్నారు.

ఉద్యోగుల వలసలు 13 శాతంగా నమోదయ్యాయి.

ఈ ఏడాది కొత్తగా క్యాంపస్‌ల నుంచి 40 వేల మందిని నియమించుకోనున్న సంస్థ..వచ్చే ఏడాది దీనికంటే అధికంగా రిక్రూట్ చేసుకోనున్నది.

ప్రస్తుత సంవత్సరానికిగాను ప్రతిషేరుకు రూ.66 ప్రత్యేక డివిడెండ్‌ను కలుపుకొని మొత్తంగా రూ.76 డివిడెండ్‌ను చెల్లించనున్నది.

## నష్టాల్లోనే దేశీయ స్టాక్ మార్కెట్లు

# 528 పాయింట్లు పతనమైన సెన్సెక్స్



దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా రెండోరోజు నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో మిశ్రమ ఫలితాలతో పాటు విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ, కార్పొరేట్ కంపెనీలు త్రైమాసిక ఫలితాల ప్రకటనల నేపథ్యంలో మార్కెట్లు నష్టాల్లో కొనసాగుతున్నాయి. కిత్రం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 78,206.21 పాయింట్ల వద్ద లాభాల్లో మొదలైంది. ఆ తర్వాత కొద్దిసేపటికి సూచీలు నష్టాల్లోకి జారుకున్నాయి. ఇంట్రాడేలో 78,206.21 పాయింట్ల గరిష్ఠాన్ని తాకిన సెన్సెక్స్.. ఒక దశలో 77,542.92 పాయింట్ల కనిష్ఠానికి పతనమైంది. చివరకు స్వల్పంగా కోలుకుంది. ట్రేడింగ్ ముగిసే సమయానికి 528.28 పాయింట్లు పతనమై.. 77,620.21 వద్ద ముగిసింది. నిఫ్టీ 162.45 పాయింట్లు తగ్గి 23,526.50 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో దాదాపు 1,175 లాభపడగా.. మరో 2,610 షేర్లు పతనమయ్యాయి. నిఫ్టీలో శ్రీరామ్ ఫైనాన్స్, ఓఎన్‌జీసీ, టాటా స్టీల్, కోల్ ఇండియా, బీపీసీఎల్ నష్టపోయాయి. హెచ్‌యూఎల్, బ్రిటానియా ఇండస్ట్రీస్, నెస్లే ఇండియా, ఎంఅండ్ఎం, బజాజ్ ఆటో లాభపడ్డాయి. ఎఫ్ఎంసీజీ మినహా మిగతా అన్ని సూచీలు.. ఐటీ, మెటల్, గ్యాస్, పీఎస్‌యూ బ్యాంక్, పవర్, రియాల్టీ ఒకటి నుంచి రెండుశాతం వరకు పతనమయ్యాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు ఒక్కొక్కటి ఒకశాతం వరకు తగ్గుముఖం పట్టాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 85.86 వద్ద ఉన్నది.

## వారాంతంలో కూడా భారీ నష్టాలు

# ఆల్‌టైం కనిష్టానికి రూపాయి



దేశీయ స్టాక్ మార్కెట్లు వారాంతంలో (జనవరి 10న) భారీ నష్టాలతో ముగిశాయి. ఈ క్రమంలో సెన్సెక్స్ 241 పాయింట్లు పడిపోయి 77,378.62 వద్దకు చేరుకోగా, నిఫ్టీ 95 పాయింట్లు తగ్గిపోయి 23,431కు చేరింది. మరోవైపు బ్యాంక్ నిఫ్టీ 769 పాయింట్లు, నిఫ్టీ మిడ్ క్యాప్ 100 సూచీ 1160 పాయింట్లు పతనమయ్యాయి. దీంతో మదుపర్లు ఒక్కరోజులోనే లక్షల కోట్ల రూపాయలను నష్టపోయారు. మధ్యాహ్నం 3 గంటలకు 779 షేర్లు పురోగమించగా, 3,173 షేర్లు క్షీణించాయి. 93 షేర్లు మారలేదు.

### కరెన్సీ బలహీనత

ఈ క్రమంలోనే 52 వారాల గరిష్టాన్ని నమోదు చేసిన స్టాక్‌ల సంఖ్య 99 కాగా, 52 వారాల కనిష్ట స్థాయిని నమోదు చేసిన స్టాక్‌ల సంఖ్య 255గా ఉంది. అప్పర్ సర్క్యూట్‌లో మొత్తం 166 షేర్లు, లోయర్ సర్క్యూట్‌లో 366 షేర్లు ట్రేడయ్యాయి. వ్యవసాయేతర పేరోల్స్ నివేదిక నేపథ్యంలో డాలర్ పుంజుకుంది. దీంతో ప్రాంతీయ కరెన్సీ బలహీనత పెరిగింది. ఈ నేపథ్యంలో డాలర్‌తో పోలిస్తే భారతీయ రూపాయి ఆల్ టైమ్ కనిష్ట స్థాయి 85.9400కి చేరుకుంది.

### టాప్ 5 లాసింగ్ స్టాక్స్

ఈ నేపథ్యంలో మధ్యాహ్నం 3 గంటలకు టాప్ గెయినర్లుగా టెక్ మహీంద్రా, టెక్నాలజీస్, విప్రో, ఇన్ఫోసిస్ ఉండగా, టాప్ లూజర్స్ స్టాక్స్‌లలో శ్రీరామ్ ఫైనాన్స్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, అదానీ ఎంటర్‌ప్రైజెస్, ఉన్నాయి. దీంతో నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 2.08 శాతం తగ్గి 54,585.75 వద్ద ముగిసింది. మరోవైపు, నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100 సూచీ 2.61 శాతం నష్టాలతో 17,645.55 వద్ద ముగిసింది. ఈ నేపథ్యంలో మధ్యాహ్నం 3 గంటలకు టాప్ గెయినర్లుగా, టెక్ మహీంద్రా, టెక్నాలజీస్, విప్రో, ఇన్ఫోసిస్ ఉండగా, టాప్ లూజర్స్ స్టాక్స్‌లలో శ్రీరామ్ ఫైనాన్స్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, అదానీ ఎంటర్‌ప్రైజెస్, ఉన్నాయి. దీంతో నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 2.08 శాతం తగ్గి 54,585.75 వద్ద ముగిసింది. మరోవైపు, నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100 సూచీ 2.61 శాతం నష్టాలతో 17,645.55 వద్ద ముగిసింది.

### ఇక రంగాల వారీగా చూస్తే..

రంగాల వారీగా నిఫ్టీ ఐటీ లాభాలలో అగ్రగామిగా 3.44 శాతం పెరిగింది. మీడియా (3.59 శాతం తగ్గింది), రియాల్టీ (2.77 శాతం తగ్గింది), బ్యాంక్ (2.72 శాతం తగ్గింది). హెల్త్‌కేర్ (2.21 శాతం) తగ్గింది. టెక్ స్టాక్‌లు కొంత ఉపశమనం కలిగించినప్పటికీ, బేరిష్ సెంటిమెంట్‌ను ప్రతిబింబిస్తూ మెటల్స్, ఫైనాన్షియల్స్ ఒత్తిడిలోకి వెళ్లాయి.

### ఒప్పందాలు..

గుజరాత్ ఫ్లోరోకెమికల్స్ లిమిటెడ్ కంపెనీ అనుబంధ సంస్థ ప్రొడక్ట్స్ లిమిటెడ్ ద్వారా విదేశీ అనుబంధ సంస్థను విలీనం చేయడం గురించి ఎక్స్ఛేంజీకి తెలియజేసింది. డిష్‌మాన్ కార్బోజెన్ ఎమెసిస్ లిమిటెడ్ తన పూర్తి యాజమాన్యంలోని అనుబంధ సంస్థగా ప్రకటించింది. బెంగళూరులో రూ. 700 కోట్ల భూ సేకరణ తర్వాత పురవంకర షేర్లు 2.22% పడిపోయాయి. పురవంకర షేర్లు 2.22% తగ్గి రూ. 362.70 వద్ద ట్రేడయ్యాయి. రూ. 700 కోట్ల ఆదాయంతో గృహనిర్మాణ ప్రాజెక్టును నిర్మించేందుకు కంపెనీ బెంగళూరులో 3.63 ఎకరాల భూమిని సేకరించింది.

# దేశ నిర్మాణమే మా ప్రధాన లక్ష్యం

# చైర్మన్ వ్యాఖ్యలపై వివరణ ఇచ్చిన ఎల్ అండ్ టీ సంస్థ

ఉద్యోగులు వారానికి 90 గంటల పాటు పని చేయాలని, ఆదివారాలు సైతం కార్యాలయాలకు వెళ్లాలని ఎల్‌అండ్‌టీ చైర్మన్ ఎస్ఎన్ సుబ్రహ్మణ్యన్ చేసిన వ్యాఖ్యలు చర్చకు దారి తీస్తున్నాయి. ముఖ్యంగా 'ఎప్పుడూ ఇంట్లోనే ఉంటూ ఏం చేస్తారు..? ఎంతసేపని భార్య ముఖం తదేకంగా చూడగలరు? ' అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. ఆయన వ్యాఖ్యలపై నెట్టింట తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అన్ని వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. పలువురు సెలబ్రిటీలు సైతం ఆయన వ్యాఖ్యలను తీవ్రంగా తప్పుపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఎల్ అండ్ టీ చైర్మన్ చేసిన వ్యాఖ్యలపై కంపెనీ స్పష్టతనిచ్చింది. దేశ నిర్మాణమే తమ సంస్థ ప్రధాన లక్ష్యం అని పేర్కొంది. గత ఎనిమిది దశాబ్దాలకు పైగా భారతదేశ మౌలిక సదుపాయాలు, పరిశ్రమలు, సాంకేతిక సామర్థ్యాలను ఎల్ అండ్ టీ మెరుగుపరిచిందని వివరించింది. అభివృద్ధి చెందిన దేశంగా ఎదిగే క్రమంలో అసాధారణ ఫలితాలు సాధించాలంటే అసాధారణమైన కృషి అవసరమని పేర్కొంది. ఈ విస్తృత లక్ష్యాన్నే చైర్మన్ వ్యాఖ్యలు ప్రతిబింబిస్తాయని వివరణ ఇచ్చింది.

### వారానికి 90 గంటలు పని చేయాలన్న ఎల్‌అండ్‌టీ చైర్మన్



ఉద్యోగులు వారానికి 90 గంటల పాటు పని చేయాలని, ఆదివారాలు సైతం కార్యాలయాలకు వెళ్లాలని ఎల్‌అండ్‌టీ చైర్మన్ ఎస్ఎన్ సుబ్రహ్మణ్యన్ తీవ్ర వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ఎల్‌అండ్‌టీ ఉద్యోగులతో ఇటీవల ఆన్‌లైన్‌లో సుబ్రహ్మణ్యన్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సంస్థలో వారానికి ఆరు రోజుల పని విధానాన్ని అమలు చేయడాన్ని ఓ ఉద్యోగి ప్రశ్నించారు. దీనికి సమాధానంగా.. 'ఆదివారాలు కూడా మీతో పని చేయించలేకపోతున్నందుకు నేను బాధపడుతున్నాను. మీతో ఆదివారాలు సైతం పని చేయిస్తే చాలా సంతోషపడతాను. ఎందుకంటే, నేను ఆదివారాలు కూడా పని చేస్తున్నాను. ఎంత సేపు ఇంట్లో కూర్చుంటావు? ఎంతసేపు నీ భార్యను అలా తదేకంగా చూస్తూ ఉండగలవు? ఆఫీసుకు వెళ్లి పని చేయడం ప్రారంభించు' అని ఆయన వ్యాఖ్యానించారు. అంతటితో ఆగని సుబ్రహ్మణ్యన్.. వారానికి 90 గంటలు పని చేయాలని సైతం ఆయన సెలవిచ్చారు. తాను ఒక చైనా వ్యక్తితో మాట్లాడానని, చైనా కార్మికులు వారానికి 90 గంటలు పని చేస్తారని, అమెరికన్లు 50 గంటలే పని చేస్తారు కాబట్టి కొన్ని రోజుల్లో అమెరికాను చైనా దాటేస్తుందని ఆ వ్యక్తి చెప్పినట్టు సుబ్రహ్మణ్యన్ చెప్పుకొచ్చారు. 'మీరు కూడా ప్రపంచంలో ఉన్నత స్థాయిలో ఉండాలంటే వారానికి 90 గంటలు పని చేయాల్సిందే. ముందుకొచ్చి పని చేయండి' అని ఆయన పిలుపునిచ్చారు. ఆయనపై నెటిజన్లు మండిపడుతున్నారు. ఉద్యోగుల వ్యక్తిగత జీవితాలను చిన్నచూపు చూసేలా ఆయన మాట్లాడుతున్నారని విమర్శిస్తున్నారు.

# స్మాల్-మిడ్ క్యాప్‌దే హవా



### స్టాక్ మార్కెట్లలో మ్యూచువల్ ఫండ్ స్కీముల జోరు

### డిసెంబర్‌లో 14 శాతం ఎగిసిన పెట్టుబడులు

మ్యూచువల్ ఫండ్స్ ఈక్విటీ స్కీముల్లోకి వచ్చే పెట్టుబడులు గత నెలలో 14 శాతానికిపైగా పెరిగాయి. డిసెంబర్‌లో రూ. 41,156 కోట్లకు చేరాయి. నిజానికి దేశీయ స్టాక్ మార్కెట్లు తీవ్ర ఒడిదొడుకుల్లో ఉన్నప్పటికీ ఈ స్థాయిలో పెట్టుబడులు రావడం విశేషం. కాగా, చిన్న, మధ్యతరహా మ్యూచువల్ ఫండ్స్ స్కీములు మదుపరులను ఆకట్టుకుంటూనే ఉన్నాయి. దీంతో గత నెల రికార్డు స్థాయికి పెట్టుబడులు వెళ్లాయని భారతీయ మ్యూచువల్ ఫండ్స్ సంఘం (యాంఫీ) తాజాగా తెలియజేసింది.

### సిప్‌లు ఆకర్షణీయం

సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్లు (సిప్) మదుపరులను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. నవంబర్‌తో చూస్తే డిసెంబర్‌లో సిప్‌ల్లోకి పెట్టుబడులు రూ.25,320 కోట్ల నుంచి రూ.26,459 కోట్లకు పెరిగాయి. దీంతో సిప్ నిర్వహణలోని మొత్తం ఆస్తులు రూ.13.63 లక్షల కోట్లకు చేరాయి. మ్యూచువల్ ఫండ్స్ నిర్వహణలో ఉన్న ఆస్తుల్లో ఇది దాదాపు ఐదో వంతుకు సమానం. గత ఏడాది డిసెంబర్ 31నాటికి మ్యూచువల్ ఫండ్స్ నిర్వహణలోని ఆస్తులు రూ.66.93 లక్షల కోట్లుగా ఉన్నాయి. అయితే నవంబర్ 30న ఇవి రూ.68.08 లక్షల కోట్లుగా ఉన్నాయి. కాగా, స్టాక్ మార్కెట్లు దిద్దుబాటు దిశగా వెళ్లడంతో డెట్ స్కీముల నుంచి రూ.1.27 లక్షల కోట్ల పెట్టుబడులను మదుపరులు వెనక్కి తీసుకున్నారని, దానివల్లే ఈ తగ్గుదల అని యాంఫీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ వెంకట్ చలసాని తెలిపారు.

### ముున్ముందు అనిశ్చిత పరిస్థితులే..

సమీప భవిష్యత్తులో దేశీయ స్టాక్ మార్కెట్లలో అనిశ్చిత పరిస్థితుల్నే చూస్తామని యాంఫీ సీఈవో వెంకట్ చలసాని చెప్తున్నారు. అమెరికాలో అధ్యక్షుడిగా ట్రంప్ వస్తుండటం.. మార్కెట్లను ఎక్కువగా ప్రభావితం చేయవచ్చని అంటున్నారు. ప్రతీకార సుంకాలు ప్రభావం చూపవచ్చన్న అంచనాలున్నాయి. అయితే దేశీయ మదుపరులు స్టాక్స్‌లో పెట్టుబడులపట్ల ఆసక్తితోనే ఉంటారన్న అభిప్రాయాన్ని చలసాని వ్యక్తం చేశారు. సిప్ పెట్టుబడులు.. స్టాక్ మార్కెట్లపై ఇన్వెస్టర్లకున్న ఉన్న విశ్వాసాన్ని ప్రదర్శిస్తున్నాయన్నారు.

### 33 న్యూ ఫండ్ ఆఫర్స్

అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీలు డిసెంబర్‌లో మొత్తం 33 కొత్త ఫండ్లను ఆఫర్ చేశాయి. వీటి ద్వారా రూ.13,643 కోట్లకుపైగా నిధులను సమీకరించాయి. అంతకుముందు నెల నవంబర్‌లో 18 స్కీములు పరిచయమవగా, రూ.4,000 కోట్ల నిధుల సమీకరణే జరిగినట్టు యాంఫీ తాజాగా ప్రకటించింది. ఇదిలావుంటే థీమ్యాటిక్ కేటగిరీ డిసెంబర్‌లో రూ.15,331 కోట్ల పెట్టుబడుల్ని అందుకున్నది. నవంబర్‌లో ఇది రూ.7,658 కోట్లే. ఇక మిడ్‌క్యాప్ కేటగిరీలోకి రూ.5,093 కోట్లు, స్మాల్‌క్యాప్ రూ.4,667 కోట్లను పొందాయి. బడా స్కీముల్లోకి రూ.2,010 కోట్లు వచ్చాయి. గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్‌ల్లోకి రూ.640 కోట్ల పెట్టుబడులు వచ్చాయని యాంఫీ సీఈవో చలసాని చెప్పారు.

# మార్కెట్లకు బ్లూ-చిప్ దెబ్బ

**అమ్మకాల ఒత్తిడిలో బడా షేర్లు**

**సెన్సెక్స్ 528, నిఫ్టీ 162 పాయింట్లు డౌన్**

దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం భారీ నష్టాలకు లోనయ్యాయి. మార్కెట్ హెవీ వెయిట్ షేట్లరైన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టీసీఎస్, రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) మూడో త్రైమాసికానికి (అక్టోబర్-డిసెంబర్)గాను ప్రకటించే ఆర్థిక ఫలితాలు ఎలా? ఉంటాయోనన్న భయాందోళనలు మదుపరులను వెంటాడాయి. అలాగే తరలిపోతున్న విదేశీ పెట్టుబడులు సైతం మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. పేలవమైన చైనా రిటైల్ ద్రవ్యోల్బణ గణాంకాలు, అమెరికా బాండ్లలో అమ్మకాల ఒత్తిడి కూడా నష్టపర్చాయి. ఈ క్రమంలోనే అంతా పెట్టుబడుల ఉపసంహరణకు తెగబడ్డారు. దీంతో బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 528.28 పాయింట్లు లేదా 0.68 శాతం పడిపోయి 78వేల మార్కుకు దిగువన 77,620.21 వద్ద స్థిరపడింది. ఒకానొక దశలో 605.57 పాయింట్లు క్షీణించడం గమనార్హం. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ కూడా 162.45 పాయింట్లు లేదా 0.69 శాతం దిగజారి 23,526.50 వద్ద ముగిసింది.

### సెన్సెక్స్ 30 షేర్లలో..

టాటా స్టీల్, జొమాటో, ఎల్‌అండ్‌టీ, టాటా మోటర్స్, అదానీ పోర్ట్స్, టీసీఎస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎన్టీపీసీ షేర్లు ప్రధానంగా సెన్సెక్స్‌లో నష్టాలను చవిచూశాయి. దేశీయ ఐటీ రంగ దిగ్గజ సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) అక్టోబర్-డిసెంబర్‌కుగాను 11.95 శాతం వృద్ధితో రూ.12,380 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. అయితే మార్కెట్ ముగిశాక ఈ ఆర్థిక ఫలితాలు వెలువడ్డాయి. దీంతో ఆ షేర్‌పై ఈ ప్రభావం లేకుండాపోయింది.

ఇక నెస్లే, హిందుస్థాన్ యునీలివర్, ఎంఅండ్ఎం, కొటక్ మహీంద్రా బ్యాంక్, ఏషియన్ పెయింట్స్, భారతీ ఎయిర్‌టెల్ షేర్లు పుంజుకున్నాయి.

### రంగాలవారీగా..

రియల్టీ 2.90 శాతం, చమురు-గ్యాస్ 2.19 శాతం, ఎనర్జీ 1.83 శాతం, పవర్ 1.68 శాతం, క్యాపిటల్ గూడ్స్ 1.54 శాతం, బీఎస్ఈ ఫోకస్డ్ ఐటీ 1.14 శాతం చొప్పున నష్టపోయాయి. బీఎస్ఈ స్మాల్‌క్యాప్ 1.17 శాతం, మిడ్‌క్యాప్ 0.96 శాతం మేరకు పడిపోయాయి. కాగా, ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియా, జపాన్, చైనా, హాంకాంగ్ సూచీలు నష్టపోయాయి. ఐరోపా మార్కెట్లూ మిశ్రమంగా ట్రేడ్ అవుతున్నాయి.



# ఇండియాఏఐతో మైక్రోసాఫ్ట్ జట్టు



### 2026 నాటికి 5 లక్షల మందికి 'ఏఐ'లో శిక్షణ

### మైక్రోసాఫ్ట్ ఇండియా ప్రెసిడెంట్ చందోక్ వెల్లడి

కేంద్ర ప్రభుత్వానికి చెందిన కృత్రిమ మేధ (ఏఐ) ప్రాజెక్ట్ 'ఇండియాఏఐ'తో అమెరికన్ టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ చేతులు కలిపింది. ఈ భాగస్వామ్యంలో దేశంలోని విద్యార్థులు, టీచర్లు, డెవలపర్లు, ప్ర?భుత్వ అధికారులు, మహిళా పారిశ్రామికవేత్తలు సహా మొత్తం 5 లక్షల మందికి ఏఐలో శిక్షణ ఇవ్వనున్నట్లు మైక్రోసాఫ్ట్ ఇండియా, దక్షిణాసియా ప్రెసిడెంట్ పునీత్ చందోక్ వెల్లడించారు. "భారత్‌లో 20 లక్షల మందికి శిక్షణ ఇవ్వనున్నట్లు గత ఏడాదే ప్రకటించాం. ఇప్పటికే 24 లక్షల మందికి శిక్షణ అందించాం. వచ్చే ఐదేళ్లలో కోటి మందికి శిక్షణ ఇవ్వనున్నట్లు తాజాగా ప్రకటించడం జరిగింది. ఇందుకోసం ఇండియాఏఐ మిషన్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకు న్నాం. ఈ ఒప్పందంలో భాగంగా 5 లక్షల మందికి శిక్షణ అందిస్తాం" అని చందోక్ పేర్కొన్నారు. తాజా ఒప్పందంలో భాగంగా మైక్రోసాఫ్ట్ 10 రాష్ట్రాలోని 20 నేషనల్ స్కిల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్స్ (ఎన్ఎసటీఐ), ఎన్ఐఈఎల్ఐటీ సెంటర్లలో ఏఐ ప్రొడక్టివిటీ ల్యాబ్స్‌ను మైక్రోసాఫ్ట్ ఏర్పాటు చేయనుంది. ఈ కేంద్రాల ద్వారా 20,000 మంది టీచర్లకు ఏఐ ఫండమెంటల్స్ శిక్షణ ఇవ్వడంతోపాటు 200 ఐటీఐల్లో 1,00,000 మంది విద్యార్థులకు ఫౌండేషన్ ఏఐ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు కంపెనీ వెల్లడించింది. అలాగే, 'ఏఐ క్యాటలిస్ట్స్' పేరుతో ఏఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కేంద్రాన్ని సైతం ఏర్పాటు చేయనున్నట్లు చందోక్ వెల్లడించారు. ఈ కేంద్రం ద్వారా గ్రామాల్లో ఏఐ ఆవిష్కరణలను ప్రోత్సహించడంతోపాటు లక్ష మంది ఏఐ డెవలపర్లకు మద్దతివ్వనున్నారు. సమాజానికి పనికివచ్చే పరిష్కారాల అభివృద్ధిని ప్రోత్సహించనున్నారు.

### సరికొత్త ఆవిష్కరణల కోసంకృషి చేయాలి: నాదెళ్ల

కృత్రిమ మేధలో సరికొత్త ఆవిష్కరణల కోసం భారత్ కృషి చేయాలని, సొంత ఫౌండేషనల్ మోడల్స్‌ను అభివృద్ధి చేసుకోవాలని మైక్రోసాఫ్ట్ సారథి సత్య నాదెళ్ల అన్నారు. కానీ, ఇందుకు పెట్టుబడుల లేమి ప్రధాన అవరోధమని, ఒక్క పురోగతి మొత్తం స్థితిగతులను మార్చగలదన్నారు. మైక్రోసాఫ్ట్ ఇండియా ఏఐ టూర్ రెండో రోజు (బుధవారం) నాదెళ్ల ఈ వ్యాఖ్యలు చేశారు. భారతీయ భాషలు, ఏఐ ద్వారా పారిశ్రామిక పరివర్తనం అంశాల్లో భారత్ గొప్పగా కృషి చేయాలన్నారు. ప్రస్తుతం భారత్ గూగుల్, ఓపెన్ ఏఐ తదితర సంస్థలు అభివృద్ధి చేసిన ఏఐ ఇంజన్లు లేదా ఫౌండేషనల్ మోడల్స్‌ను ఉపయోగించుకుంటోంది.

Ho no:LIG-32,, Ph No:- 9247842354, 9059207979,near water tank, Bharat Nagar colony, moos-apet, Hyderabad, pin code 500018.